JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I మంగళవారం 26-05-2026
Medchal - Malkajgiri I Tuesday 26-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 I సంచిక : 360
పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 360 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com






ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా పాలనకు శ్రీకారం చుట్టాం. వారి ఆలోచనలకు, ఆకాంక్షలకు ఒక్కొ అడుగు వేస్తూ ఆకారం ఇస్తున్నాం. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం నుండి వ్యాపార అవకాశాల వరకు మహిళలనే మహారాణులుగా గుర్తించి, గౌరవిస్తున్నాం. మహిళ స్వయం శక్తి సంఘాలతో సంఘటితంగా వారి శక్తిని ప్రపంచానికి చాటి చెబుతున్నాం. ఆడబిడ్డల ఐక్యతకు ఇందిర మహిళ శక్తి సంఘం ప్రతి రూపమైతే, ఆ సంఘానికి చిరునామా ఈ "ఇందిర స్త్రీ శక్తి భవన్". వేలాది మంది మహిళల సమక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా 8000 "ఇందిర స్త్రీ శక్తి భవనాల"కు సచివాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేశాను.

# మహిళలే.. మహారాణులు

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిన్ని కీలక నిర్ణయాలను ప్రకటించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభించడానికి వీలుగా సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లతో పాటు మహిళలు వ్యాపార రంగంలో మరింతగా రాణించడానికి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైస్ మిల్లులు, గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. బ్యాంకుల నుంచి వీటికి అవసరమైన రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల కోసం 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పి. శ్రీనివాస్ రెడ్డి, మహిళ కమిషన్ ఛైర్పర్సన్ జి. విజయ లక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలకు అందించే ఇందిరమ్మ చీరల డిజైన్లను ముఖ్యమంత్రి కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవడానికి మొదటి విడతగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం అవసరమైన స్థలం గుర్తించి

...మిగతాది 2 లో

# భారత ఆర్థిక వ్యవస్థకు ఢోకా లేదు



- నిరాశావాదుల ప్రచారం నమ్మొద్దు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం
- ప్రజలకు ధైర్యం , భ రోసా ఇవ్వాల్సింది పోయి.. సమాజంలో అనవసర భయాందోళ నలు సృష్టించడం బాధ్యతారాహిత్యమని ఆర్థిక మంత్రి ఆగ్రహం
- దేశ ప్రజలకు, పారిశ్రామిక వర్గాలకు మరోసారి గట్టి భ రోసా

**జయభేరి, న్యూఢిల్లీ:**

పశ్చిమాసియా రూపంలో అంతర్జాతీయంగా ఎదురవుతున్న భౌగోళిక రాజకీయ సవాళ్ల నేపథ్యంలో భారతదేశ చమురు, ఎరువులు, విదేశీ మారక నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ముంబయిలో ఘనంగా జరిగిన సిడ్బీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు, కొందరు నిరాశావాదులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆమె తీవ్రస్థాయిలో తిప్పికొట్టారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధనం, ఎరువులు, బంగారం ధరలు రికార్డు స్థాయిలో భారీగా పెరిగాయని నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. గ్లోబల్ మార్కెట్‌లో ఈ మూడింటికీ డాలర్ల రూపంలోనే భారీగా చెల్లింపులు జరగాల్సి ఉంటుందని, దీనివల్ల దేశీయంగా విదేశీ మారక నిల్వలు కరిగిపోకుండా

...మిగతాది 2 లో

# ఇదేనా ప్రజా పాలన..



- భద్రాచలంలో వాహనం లేక మృతదేహన్ని భుజాలపై మోసుకెళ్లడంపై ఆయన తీవ్ర ఆగ్రహం
- ఒక గర్భిణీకి కనీస వైద్య రవాణా సదుపాయం కల్పించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు 108 అత్యవసర సేవలు

**జయభేరి, హైదరాబాద్, మే 25 :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య సేవలు కుప్పకూలాయని మాజీ మంత్రి హరీష్ రావు ట్విట్టర్ వేదికగా ఆరోపించారు. తాండూరులో అంబులెన్స్ రాక రైల్వే ప్లాట్ ఫారమ్‌పై మహిళ ప్రసవించడం, భద్రాచలంలో వాహనం లేక మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో పేదల కోసం తెచ్చిన 108 అంబులెన్స్, పరమపద వాహనాలను నిర్వీర్యం చేశారని మండిపడుతూ.. ప్రజలు కోరుకున్న ప్రజా పాలన ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే అత్యవసర సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న ప్రజా పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్ రావు సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సంరక్షణ వ్యవస్థ తీవ్రంగా అస్తవ్యస్తమైందని పేద ప్రజల ప్రాణాలకు రక్షణ

...మిగతాది 2 లో



# భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం

- జగన్ ను అరెస్ట్ చేయమని అడిగే చీప్ కారెక్టర్ కాదు నాది.. పవన్ కల్యాణ్
- అమిత్‌షాతో చెబితే ప్రొ. నాగేశ్వర్ విన్నారా..?

**జయభేరి, విజయవాడ, మే 25 :**

వ్యక్తిగత ఎదుగుదల కోసం తనను పంచింగ్ బ్యాగ్‌లా వాడుకోవడం మానేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శకులకు.. విశ్లేషకులను హెచ్చరించారు. తన సహనాన్ని పరీక్షించొద్దన్నారు. సోమవారం రాజమండ్రిలో పార్లమెంటరీ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ చాలా తీవ్ర స్థాయిలో రియాక్టయ్యారు. ముఖ్యంగా రాజకీయ విశ్లేషణల పేరుతో క్యారెక్టర్ ను కించపరిచేలా మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు . రాజకీయాల్లో తనను పంచింగ్ బ్యాగ్ లా వాడుకోవడం ఇకపై సాధ్యం కాదని, సహనానికీ ఒక హద్దు ఉంటుందని గత పుష్కర కాలంగా తాను ఎన్నో అవమానాలను, వ్యక్తిగత విమర్శలను

...మిగతాది 2 లో

# గ్రామ పంచాయితీలకు భారీగా నిధులు




- ఐదేళ్ల కాలానికి గాను రాష్ట్రానికి రూ.9,968 కోట్ల నిధులు
- నిధుల దుర్వినియోగానికి తావులేకుండా ఉండేందుకు కేంద్రం కఠినమైన పర్యవేక్షణ నిబంధనలను తెచ్చింది
- నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే చట్టపరమైన కఠిన చర్యలు

**జయభేరి, హైదరాబాద్, మే 25 :**

తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర 16వ ఆర్థిక సంఘం భారీగా నిధులను కేటాయించింది. 2026 27 ఆర్థిక సంవత్సరం నుంచి 203031 వరకు ఐదేళ్ల కాలానికి గాను రాష్ట్రానికి రూ.9,968 కోట్లను నిర్దేశించింది. ఈ నిధుల వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిధులను కేవలం గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, స్ట్రీట్ లైట్‌ల ఏర్పాటు వంటి ప్రజా సేవల కోసమే

...మిగతాది 2 లో

# చైతన్య విజ్ఞానం భూమి శక్తి సమతుల్యం

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మహిళలే.. మహారాణులు

మహిళా సంఘాలకు నామినల్ అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజుపైన ఇవ్వడానికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి" అని మంత్రి పొంగులేటికి చెప్పారు. ఈ సూపర్ బజార్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కార్పస్ ఫండ్ ఇస్తామని, సంఘాల్లోని ప్రతి మహిళ కొంత మేరకు పెట్టుబడిని సమకూర్చుకోవాలని సూచించారు. "కార్పొరేట్ కంపెనీలు నడిపిస్తున్న చైన్ సూపర్ బజార్లలో వస్తువులను అత్యధికంగా కొనుగోలు చేసేది మహిళలే. నిత్యవసర వస్తువులు, అత్యవసర వస్తువులు ఏవైనా నాణ్యమైన వస్తువులు కొనాలంటే మహిళా శక్తి బజార్లలో కొనాలి అనే విధంగా బ్రాండ్ ఇమేజీని సాధించాలి. దేశంలోనే అత్యుత్తమ సూపర్ బజార్లుగా రాణించాలి" అని అభిలషిస్తూ అందుకు ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. "రైస్ మిల్లులను స్వయంగా మీరే పెట్టుకోండి. అదే విధంగా లాజిస్టిక్ సెంటర్లను కట్టుకోండి. మండలాల్లో స్థలాలు ఇచ్చే బాధ్యత నాది. పెద్ద గోడౌన్లు కట్టుకోండి. భవిష్యత్‌లో బ్యాంకుల నుండి రుణాలను ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. కొత్త మంది మిల్లర్లు, దళారులు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. వాటిని ఆడబిడ్డలకు ఇవ్వడం ద్వారా జవాబుదారీతనంగా ఉంటారు. భవిష్యత్‌లో ప్రతి మండలంలో పెద్ద పెద్ద గోడౌన్లు కట్టడం ద్వారా ధాన్యం వాటిల్లో భద్రపరుస్తాం. మహిళల దగ్గర నుండే మిల్లర్లు తీసుకెళ్లాలి. ప్రతి మండలంలో 2 నుండి 4 స్థలాలను గుర్తించి గోడౌన్లు నిర్మించుకోవడానికి ఏ విధమైన ప్రణాళిక అవసరమో కలెక్టర్లు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశిస్తున్నా. అందుకు అవసరమైన స్థలాలు ఇచ్చే పూచీ నాది. ఇందుకు అవసరమైన రుణాలను జీరో వడ్డీతో బ్యాంకు లింకేజీ కూడా సహకారం ఇస్తాం" అని చెప్పారు. "మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా నిలబడుతుంది. మహిళలు స్వశక్తి మీద నిలబడటానికి, ఆర్థికంగా ఎదగడానికి, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడానికి తీసుకున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా 29 నెలల్లో రూ. 10 వేల కోట్లకు పైగా సంస్థకు చెల్లించాం" అని పేర్కొన్నారు. "ఇందిరాగాంధీ స్త్రీ శక్తి అంగన్‌వాడీ భవనాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, అద్దెపై ఆర్టీసీకి ఇవ్వడానికి బస్సులతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ఈ వారంలో చేపడుతున్నాం. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు 8 వేల భవనాలను ఒకే రోజు శంకుస్థాపన చేసుకుని దేశంలోనే ఒక గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నాం" ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మంత్రులు, అధికారులను అభినందించారు. "మహిళా సంఘాలకు వెయ్యి బస్సులను కేటాయించి తద్వారా అద్దె రూపేణా నెలకు రూ. 70 వేల ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు వేశాం. అందులో భాగంగా జూన్ 5వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి మరో 553 బస్సులను అందించబోతున్నాం" అని ప్రకటించారు. "ఆడబిడ్డలకు బ్యాంకు రుణాల లింకేజీ ఇవ్వడమే కాకుండా, వ్యాపారంలో రాణించడానికి, వారికి కావలసిన వ్యాపారాలు వారు వృద్ధి చేసుకోవడానికి వీలుగా ఈ నెల 29న వీహబ్ ద్వారా ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ కింద అవసరమైన వ్యాపారాల ప్రణాళికలను అందించే కార్యక్రమం చేపడుతున్నాం" అని చెప్పారు. "మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల లింకేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నాం. మహిళా సంఘాల రుణాలపై జీరో వడ్డీ కింద ప్రభుత్వం రూ. 1390 కోట్లు చెల్లించింది. చెల్లింపుల్లో నిర్మల్ జిల్లా నూటికి శాతం నూరు శాతం చెల్లించారని" చెబుతూ ఆ జిల్లా మహిళలను ముఖ్యమంత్రి ప్రశంసించారు. అన్ని జిల్లాల నుంచి కలెక్టర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన జిల్లాల మహిళా ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో అధిక లాభాలను ఆర్జించిపెట్టే పంటల మార్పిడి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. "2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మంత్రిమండలి మొత్తం మహిళలందరినీ సొంత సోదరీమణులుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## భారత ఆర్థిక వ్యవస్థకు ఢోకా లేదు

జాగ్రత్తపడాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయంగా ఆర్థిక వృద్ధికి, సామాన్యుడి బడ్జెట్‌కు ఆటంకం కలగకూడదన్న పక్కా వ్యూహంతోనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని ఆర్థిక మంత్రి వివరించారు. ఈ పన్నుల తగ్గింపు నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ. 1 లక్ష కోట్ల మేర అదనపు ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని, అయినా ప్రజల సంక్షేమం కోసమే ఈ భారాన్ని మోస్తున్నామని చెప్పారు. ఆ మూడు 'F'ల పైనే ప్రధాని మోదీ ఫోకస్: ప్రస్తుత అంతర్జాతీయ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా '3 F'లపై (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్) దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ పౌరులను, యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ ముందస్తు పొదుపు చర్యలను ప్రకటిస్తే.. దీన్ని కొందరు అవకాశంగా మార్చుకుని భారత ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతోందన్న రేంజ్‌లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నిరాశావాద ధోరణి ఏమాత్రం సరికాదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న మంచిని విస్మరించి.. లేనిపోని అపోహలను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితులకు దేశీయ విధానాలు కారణం కాదని, అంతర్జాతీయ బాహ్య కారకాలే ప్రధాన కారణమన్న కనీస సత్యాన్ని విస్మరించకూడదని చెప్పారు. ప్రజలకు ధైర్యం, భరోసా ఇవ్వాల్సింది పోయి.. సమాజంలో అనవసర భయాందోళనలు సృష్టించడం బాధ్యతారాహిత్యమని ఆర్థిక మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాహ్య సవాళ్లు ఎన్ని ఉన్నప్పటికీ అంతర్గతంగా భారత్ ఎంతో బలంగా ఉందని, మన ఆర్థిక వ్యవస్థ సురక్షితంగా ఉందంటూ నిర్మలా సీతారామన్ దేశ ప్రజలకు, పారిశ్రామిక వర్గాలకు మరోసారి గట్టి భరోసా ఇచ్చారు.

## గ్రామ పంచాయితీలకు భారీగా..

వినియోగించాలని కేంద్రం స్పష్టం చేసింది. అయితే ఈ గ్రాంట్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపుల కోసం ఉపయోగించరాదని ఖచ్చితమైన నిబంధన విధించింది. నిధుల దుర్వినియోగానికి తావులేకుండా ఉండేందుకు కేంద్రం కఠినమైన పర్యవేక్షణ నిబంధనలను తెచ్చింది. ప్రతి స్థానిక సంస్థ ఎప్పటికప్పుడు తమ వ్యయ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. త్రైమాసిక, వార్షిక పురోగతి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని, వాటి ఆధారంగా సమగ్ర నివేదికలను రాష్ట్రం కేంద్రానికి సమర్పించాలని ఆదేశించింది. ఆడిట్‌లో ఏవైనా లోపాలు గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని, అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని దీనిపై తగిన పరిపాలన ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఐదేళ్ల కాలానికి ఆర్థిక సంఘం దేశం మొత్తానికి రూ.4,35,236 కోట్లను గ్రాంట్లుగా ప్రకటించింది. ఇందులో 80 శాతం నిధులు నేరుగా పంచాయతీలకు, 10 శాతం మండల పరిషత్‌లకు, మరో 10 శాతం జిల్లా పరిషత్‌లకు దక్కుతాయి. ఈ నిధులను ఏటా జూన్, అక్టోబర్ నెలల్లో రెండు విడతల్లో విడుదల చేస్తారు. అయితే మొత్తం నిధుల్లో 20 శాతం నిధుల విడుదలను పనితీరు ఆధారంగా కేంద్రం నిర్ణయిస్తుంది. రాష్ట్రాలు స్థానిక సంస్థలకు ఏ మేరకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నాయనే అంశంపై రాష్ట్ర పనితీరును, పన్నుల వసూళ్లు, సొంత ఆదాయ వనరుల పెంపుదల ఆధారంగా పంచాయతీల పనితీరును పరిగణనలోకి తీసుకుంటారు. 2026 నాటి అంచనాల ప్రకారం గ్రామీణ జనాభాకు 90 శాతం, రాష్ట్ర వైశాల్యానికి 10 శాతం వెయిటేజీ ఇచ్చారు. ఈ లెక్కన తెలంగాణ గ్రామీణ జనాభాకు 1.92 శాతం, వైశాల్యానికి 0.37 శాతం చొప్పున మొత్తం రూ.9,968 కోట్ల నిధులు దక్కాయి. మొదటి విడత నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ వివరాలతో పాటు, 202526 ఆర్థిక సంవత్సరం నాటి స్థానిక సంస్థల ఆడిట్ నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది. మొదటి విడత నిధుల వినియోగ ధ్రువీకరణ, పురోగతి ఆధారంగానే రెండో విడత నిధులు విడుదలవుతాయి. కేంద్రం నుంచి గ్రాంట్లు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు చేరుతాయి. అక్కడి నుంచి కేవలం పది పనిదినాల్లోగా సంబంధిత గ్రామీణ స్థానిక సంస్థల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయాలి. రాజ్యాంగంలోని 9వ భాగం ప్రకారం సక్రమంగా ఎన్నికలు జరిగి, ప్రజాప్రతినిధులు ఉన్న స్థానిక సంస్థలకే ఈ నిధులు విడుదలవుతాయి. నిర్దేశిత అవసరాలకు కేటాయించిన నిధులను వాటికే వెచ్చించాలి. అన్‌టైడ్ నిధులలో 20 శాతం కంటే ఎక్కువ మొత్తాన్ని రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం ఖర్చు చేయరాదు. నిధుల వినియోగంపై తప్పనిసరిగా గ్రామ సభలో, మండల, జిల్లా ప్రజా పరిషత్ సమావేశాల్లో తీర్మానాలు చేయాలి. ఆ తీర్మానాలను కేంద్ర ప్రభుత్వ ఇగ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది.

# చైతన్య విజ్ఞానం
# భూమి శక్తి సమతుల్యం

✍ జయభేరి, హైదరాబాద్ :

**1. విద్యుత్‌చుంబక వికిరణం**

భూమి సహజంగా ఒక చుంబక శక్తి క్షేత్రాన్ని విడుదల చేస్తుంది. ఈ భూమి శక్తి తరంగాలు సుమారు 30Hz ప్రకంపనల వద్ద పనిచేస్తాయి. మన ఇళ్లలో ఉపయోగించే విద్యుత్ వ్యవస్థలు సాధారణంగా 50Hz వద్ద పనిచేస్తాయి. ఈ కృత్రిమ ప్రకంపనలు మన శరీరంలోని సహజ జీవ చక్రాలను ప్రభావితం చేయవచ్చని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. తరంగాలు 0.5 నుండి 100Hz వరకు ఉండి, మన నాడీ వ్యవస్థ, నిద్ర, మానసిక ప్రశాంతత పై ప్రభావం చూపవచ్చని భావిస్తారు.

**2. జియోపాథిక్ స్ట్రెస్.. ఆరోగ్యం**

జియోపాథిక్ స్ట్రెస్ అనేది భూమి నుండి వెలువడే అసమతుల్య ప్రకంపనలు మన శరీర శక్తి క్షేత్రాన్ని ప్రభావితం చేసే పరిస్థితిగా వివరించబడుతుంది.
కొన్ని అధ్యయనాలలో దీర్ఘకాలిక ఒత్తిడి, అలసట, నిద్రలేమి, మానసిక అస్థిరత వంటి అంశాలు ఈ రకమైన వాతావరణ ప్రభావాలతో సంబంధం ఉండవచ్చని పరిశీలించారు.

**3. జియోపాథిక్ స్ట్రెస్ వల్ల కలగవచ్చని చెప్పబడే ప్రభావాలు – భాగం 1**

అలసట, మానసిక అస్థిరత
అధిక ఆందోళన
శరీర రోగనిరోధక శక్తి తగ్గడం
నిద్రలో అంతరాయం
భావోద్వేగ అసమతుల్యత
చిరాకు
మైగ్రేన్ తలనొప్పులు
చర్మ సమస్యలు
శ్వాస సంబంధిత సమస్యలు

**4. జియోపాథిక్ స్ట్రెస్ వల్ల కలగవచ్చని చెప్పబడే ప్రభావాలు – భాగం 2**

ఏకాగ్రత లోపం
జ్ఞాపకశక్తి తగ్గడం
శరీర నొప్పులు
వెన్నునొప్పి
నిద్రలో పళ్లు కొరకడం
రాత్రిపూట మెలకువ రావడం
హార్మోన్ల అసమతుల్యత
భావోద్వేగ అసహనం
శక్తి తగ్గిపోవడం

**5. జియోపాథిక్ స్ట్రెస్ (భూగర్భ జల ప్రవాహాలు)**




భూమి అడుగున ప్రవహించే నీటి ధారలు, ఖనిజాలు, భూభాగ చీలికలు.. కొన్ని ప్రాంతాల్లో అసమతుల్య శక్తి ప్రకంపనలను సృష్టించవచ్చని భావిస్తారు. ఒక వ్యక్తి ఎక్కువసేపు అలాంటి ప్రాంతంలో నిద్రించడం లేదా పని చేయడం వల్ల శరీర శక్తి క్షేత్రం ప్రభావితమవుతుందని కొన్ని ప్రత్యామ్నాయ ఆరోగ్య విధానాలు చెబుతున్నాయి.

**6. పునరావృత దురదృష్టం**

కొన్ని సంప్రదాయ పద్ధతుల ప్రకారం, అసమతుల్య స్థల శక్తి కారణంగా:
కుటుంబ కలహాలు
వ్యాపార నష్టాలు
మానసిక ఒత్తిడి
ఇంట్లో ప్రశాంతత లేకపోవడం
నిరంతర సమస్యలు
అసహజ సంఘటనలు
జరుగుతాయని విశ్వసిస్తారు.

**7. విద్యుత్‌చుంబక వికిరణం వల్ల ఆరోగ్యంపై ప్రభావాలు**

ఆధునిక జీవనశైలిలో:
మొబైల్ ఫోన్లు
టెలివిజన్లు
కంప్యూటర్లు
వైఫై రౌటర్లు
విద్యుత్ పరికరాలు
నిరంతరం EMF తరంగాలను విడుదల చేస్తుంటాయి. కొంతమంది పరిశోధకుల అభిప్రాయం ప్రకారం అధిక EMF పరిసరాలు నిద్ర, మానసిక ప్రశాంతత, జీవశక్తిపై ప్రభావం చూపవచ్చు.

**8. జియోపాథిక్ స్ట్రెస్ వల్ల ఆరోగ్య సమస్యలు – భాగం 3**

శక్తిహీనత
శరీర బలహీనత
దీర్ఘకాలిక అలసట
పిల్లల్లో ఏకాగ్రత లోపం
అధిక ఆందోళన
నిద్రలేమి
తలనిర్ఘాంతం
మానసిక అస్థిరత

**9. జియోపాథిక్ స్ట్రెస్ (కారణాలు)**

జియోపాథిక్ స్ట్రెస్‌కు కారణాలుగా భావించబడేవి:
భూగర్భ జల ప్రవాహాలు
ఖనిజ సముదాయాలు
విద్యుత్ క్షేత్రాలు, భూభాగ చీలికలు
భూగర్భ నిర్మాణాలు
అధిక ఎలక్ట్రోమాగ్నెటిక్ తరంగాలు
శంభాల 360 ప్రకారం మనిషి శరీరం కేవలం శారీరక నిర్మాణం కాదు...అది ఒక చైతన్య శక్తి వ్యవస్థ. ధ్యానం, శబ్ద ప్రకంపనలు, స్థల శుద్ధి, సానుకూల సంకల్పం, ప్రకృతి సమతుల్యం ద్వారా జీవన శక్తిని మెరుగుపరచవచ్చని మేము విశ్వసిస్తున్నాము.

## ఇదేనా ప్రజా పాలన..

కరువైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తాండూరు మరియు భద్రాచలం ప్రాంతాల్లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు హృదయవిదారక సంఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ మేరకు ఆయన చేసిన ట్వీట్ చేశారు. 'వికారాబాద్ జిల్లా తాండూరులో ఒక నిరుపేద గర్భిణీ స్త్రీ ప్రసవ వేదనతో తల్లడిల్లుతూ అత్యవసర సహాయం కోసం 108 అంబులెన్స్ సేవలకు పలుమార్లు ఫోన్ చేసింది. అయితే ఎన్నిసార్లు పిలిచినా అంబులెన్స్ సకాలంలో స్పందించకపోవడంతో విధిలేక ఆమె రైల్వే ప్లాట్‌ఫారమ్‌పైనే బిడ్డకు జన్మనివ్వాల్సి వచ్చింది. ఒక గర్భిణీకి కనీస వైద్య రవాణా సదుపాయం కల్పించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట' అని హరీష్ రావు దుయ్యబట్టారు. అలాగే భద్రాచలంలో జరిగిన మరో సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఒక నిరుపేద కుటుంబంలో వ్యక్తి మరణిస్తే మృతదేహాన్ని గౌరవప్రదంగా స్వగ్రామానికి తరలించేందుకు భద్రాచలం ఏరియా ఆసుపత్రి యాజమాన్యం కనీసం ఒక ఉచిత అంబులెన్స్ కూడా సమకూర్చలేదన్నారు. దీనితో ఆ పేద కుటుంబ సభ్యులు తమ బంధువు శవాన్ని భుజాలపైనే మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.
బ్రతికున్నప్పుడు ప్రాణాలు కాపాడటానికి అంబులెన్స్‌లు లేవు.. చనిపోయాక కనీస మానవీయ గౌరవంతో తీసుకెళ్లడానికి వాహనాలు లేవని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు 108 అత్యవసర సేవల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మృతదేహాలను ఉచితంగా తరలించేందుకు పరమపద వాహన సేవలను ప్రవేశపెట్టామని హరీష్‌రావు గుర్తుచేశారు. నాడు పేదల పాలిట రక్షణ కవచాలుగా ఉన్న ఈ ఉచిత సేవలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిర్వీర్యం చేసిందని ఆయన ప్రశ్నించారు.
ఇవి కేవలం పరిపాలనాపరమైన సాధారణ లోపాలు మాత్రమే కావని.. అత్యవసర పరిస్థితులు, అనారోగ్యం, ప్రసవాలు, మరణాల సమయంలో పూర్తిగా ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడే నిరుపేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇవి నిలువెత్తు సాక్ష్యాలని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే అత్యవసర ఆరోగ్య సేవలను పునరుద్ధరించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో 108 అంబులెన్స్‌లు, శవవాహన సేవలు నిరంతరాయంగా, సక్రమంగా పనిచేసేలా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘోర పరిణామాలకు కారణమైన అధికారులను, వ్యవస్థలను జవాబుదారీలను చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు జీవితంలోనూ, అత్యవసర సమయాల్లోనూ, ఆఖరికి మరణంలోనూ కనీస మానవీయ గౌరవాన్ని పొందే హక్కు ఉందని దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఆయన తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

## భరిస్తాం.. సహిస్తాం..

భరిస్తూ వచ్చానని, కానీ తన మౌనాన్ని బలహీనతగా భావిస్తే ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "భరిస్తాం, సహిస్తాం.. హద్దులు దాటితే తాట తీస్తాం" అంటూ ఆయన ఇచ్చిన హెచ్చరించారు.

**ప్రొ. నాగేశ్వర్‌పై పరోక్ష కామెంట్స్**

ఇటీవల పవన్ కల్యాణ్ గురించి రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్లు వివాదాస్పదం అయ్యాయి. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలని పవన్ కల్యాణ్ అడిగితే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నిరాకరించారని ఆయన చేసిన కామెంట్లపై జనసేన నేతలు తీవ్రంగా రియాక్టయ్యారు. ఆయనపై కేసు కూడా నమోదు చేశారు. దానిపై పవన్ కల్యాణ్ ఇవాళ రియాక్ట్ అయ్యారు. ప్రొఫెసర్ పేరెత్తకుండానే ఇలాంటివి తాను సహించలేనన్నారు. అమిత్‌షాతో నేను మాట్లాడినప్పుడు.. ఆయన పక్కన ఉన్నారా..? ఆయనంటే గౌరవం ఉంది.. కానీ దారినపోయే వాళ్లు చేసినట్లుగా.. ఓ స్థాయిలో ఉన్న వాళ్లు ఇలాంటి కామెంట్లు చేయకూడదు.." అన్నారు.

**వ్యక్తిత్వ హననంపై ఆగ్రహం**

రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ ఒక పథకం ప్రకారం తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించబోనని పవన్ హెచ్చరించారు. "నాకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. కానీ నేను తిరిగి సమాధానం ఇస్తే మాత్రం మీకు కులం గుర్తొస్తుందా? మేధావులమని చెప్పుకునే వారు తమ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటే మేము చేతులు కట్టుకుని కూర్చోవాలా?" అని ఆయన ప్రశ్నించారు. సామాన్య మనుషుల్లాగే తమకూ ఆవేశం, కడుపు మంట ఉంటాయని, ఇకపై ప్రతి విమర్శకు అదే స్థాయిలో కౌంటర్లు ఉంటాయని స్పష్టం చేశారు. నేను అమిత్‌షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు.

**జగన్ జైలు కోసం నేను అడుగుతానా..? నా తెగింపు తెలీదా..?**

జగన్‌ను జైలులోకి పంపించమని తాను కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను అడిగానని చెప్పడంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ మండిపడ్డారు. జగన్ ను జైలుకు పంపమని అడగాల్సిన అవసరం తనకేంటన్నారు. ఒకవేళ ఆయన జైలుకు వెళితే తన పార్టీకి ఏమైనా లాభమా అని ప్రశ్నించారు. డర్టీ పాలిటిక్స్ చేయడానికి రాజకీయాల్లోకి రాలేదని. జగన్ కంటే ముందే తాను రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. వైఎస్ ఉన్నప్పుడే తుపాకి సరెండర్ చేసి రాజకీయాల్లోకి వచ్చానని అంతటి తెగింపు ఉన్న తాను జగన్‌పై కంప్లెయింట్ చేస్తానా ..? అని ప్రశ్నించారు. అయినా ప్రధాని, హోం మంత్రిలను కలిసినప్పుడు దేశ భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన విషయాలు మాట్లాడతాం కానీ... జగన్ గురించి ఎందుకు చెబుతామన్నారు. అయినా జగన్‌ను ఏం చేయాలో వ్యవస్థలకు తెలుసన్నారు.

**పార్టీ నేతలకు హెచ్చరిక**

గీతదాటుతున్న పార్టీ నేతలకు పవన్ హెచ్చరికలు జారీ చేశారు. తనకు నచ్చినట్లుగా పార్టీని నడుపుతానని ఇష్టం లేని వాళ్లు వెళ్లిపోవచ్చన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడిపోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని స్పష్టం చేశారు. మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు అంటూ పార్టీ నేతలకు పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. నేను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా అంటూ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో బదులిస్తామని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

**తమిళనాడు రాజకీయాలను చూసి జెలసీ కలిగింది..!**

జనసేనాని పవన్ కళ్యాణ్ పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాలపై, అక్కడ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే సాధించిన తాజా విజయాలపై అత్యంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో తనను, విజయ్‌ను పోలుస్తూ వస్తున్న కామెంట్లపై స్పందించిన ఆయన.. తమిళ పాలిటిక్స్‌ను చూస్తే తనకు కొంత అసూయ కలిగిందని మనసులో మాటను బయటపెట్టారు. "అక్కడ రాజకీయాలు ఎంత సుఖంగా సాగాయో చూశాను.. తమిళనాడులో విజయ్ అభిమానులంతా విభేదాలు లేకుండా ఏకతాటిపై నిలబడ్డారు, ఎంచక్కా కటౌట్లు పెట్టుకున్నారు, ప్రచారం చేశారు, ఒకేసారి సీఎంను చేసేశారు. కానీ ఆంధ్రాలో నా పరిస్థితి అలా కాదు. నన్ను దాదాపు 15 సంవత్సరాల పాటు రోడ్డు మీద దేకిచ్చారు అంటూ పవన్ తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో పడ్డ కష్టాలను, ఆవేదనను గుర్తుచేసుకున్నారు. "మనకు అనుకూలంగా మాట్లాడటానికి కనీసం సొంతంగా టీవీ ఛానళ్లు ఉన్నాయా? ఆఖరికి మనకున్న సోషల్ మీడియా హ్యాండిల్స్ అయినా నాకు ఏదైనా కష్టం వస్తే ఒకే తాటిపై, ఏకాభిప్రాయంతో నిలబడుతున్నాయా?" అంటూ పార్టీ అంతర్గత లోపాలను సున్నితంగా వేలెత్తి చూపారు. కేవలం సినిమా క్రేజ్, కటౌట్లు చూసి ఓట్లేసే సంస్కృతి కంటే ఏపీలో కుల సమీకరణాలు, పక్కా వ్యూహాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయని, అందుకే తాను ఎన్నో అవమానాలు భరించి, పొత్తుల ఫార్ములాతో నిలబడాల్సి వచ్చిందని వివరించారు.

## చెన్నూర్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

- ప్రతి గింజ కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తాం
- రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

✍ జయభేరి, చెన్నూర్, మే 25 :

జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈసారి చెన్నూర్ నియోజకవర్గంలో వరి పంట అంచనాలకు మించి అధిక దిగుబడి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దీంతో కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని మంత్రి సూచించారు. చెన్నూర్ ప్రాంతంలో ధాన్యం నిల్వ కోసం గోదాముల సౌకర్యాలను పెంచడంతో పాటు హమాలీల సంఖ్యను కూడా పెంచుతున్నామని వెల్లడించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న లారీలకు అదనంగా మరో 75 లారీలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని చెప్పారు.
రాబోయే వారం రోజుల్లో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేసి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర చెల్లిస్తామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా, ఆలస్యం చేయకుండా తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# మహిళలు సంపాద సృష్టికర్తలుగా ఎదిగేలా కృషి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి
- జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో కలిసి మహిళా శక్తి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహిళలు సంపాద సృష్టికర్త లుగా ఎదిగేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రజా పాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకొని మండల మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనంగా ప్రారంభించారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్ లతో కలిసి ఈ బస్సును ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుండి మే 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక మరియు రాజకీయ సాధికారతను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలలను పారిశ్రామికవేత్తలుగా, సంపాద సృష్టికర్తలుగా ఎదిగేలా చేస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ వారి పేరు మీదనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తూ వారిని పెట్రోల్ బంకులకు యజమానులు చేసిందన్నారు. కొత్తకోట మండలం మీరాస్ పల్లి వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఆర్టీసీలో 1000 బస్సులకు మహిళలకు యజమాలను చేశామని, అదేవిధంగా వడ్డీ లేని రుణాలు, సోలార్ యూనిట్లు, ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేయించి మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామన్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఇచ్చిన మాట మేరకు హామీలు నెరవేరుస్తు న్నామన్నారు.అందులో భాగంగానే ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,10 లక్షల ఆరోగ్యశ్రీ, 500లకే సిలిండర్, 2 లక్షల రుణమాఫీ, 500లబోనస్, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణను ప్రపంచం తోనే పోటీ పడేలా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతుందన్నారు. ప్రజల అండదండలు, ప్రేమ, ఆశీస్సులు మా ప్రజా ప్రభుత్వం పై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వరి కొయ్యకాలు తగులబెట్టవద్దు

- మొక్కజొన్న కొయ్యలను కాల్చవద్దు
- పంచాయతీలు కార్యదర్శులు సాటింపు చేయించాలి
- రైతులకు తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి

జయభేరి, సైదాపూర్ :

సైదాపూర్ మండల రైతులకు వరి కోతల అనంతరం వరి, మొక్కజొన్న కొయ్యకాలకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, రైతుల ఆస్తులకు తీవ్ర నష్టం జరుగుతోందని తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు వరి మొక్కజొన్న కొయ్యలను కాల్చవద్దని సాటింపు చేయాలని పేర్కొన్నారు. అలాగే రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ సూచించారు. వరి కొయ్యకాలు తగులబెట్టడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నాశనం అవుతాయని, గాలి కాలుష్యం పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా పక్క పొలాలు, చెట్లు, విద్యుత్ లైన్లకు అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు వరి పరకను ట్రాక్టర్ ద్వారా నేలలో కలపడం, పశువుల మేతగా వినియోగించడం, కంపోస్ట్ లేదా సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించడం, మష్రూమ్ పెంపకానికి వినియోగించడం, బేలర్ యంత్రాల ద్వారా సేకరించి విక్రయించడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని ఆయన సూచించారు.వ్యవసాయ శాఖ కూడా పరక కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రోత్సహిస్తోందని, రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదాలను నివారించాలని తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ రైతులను కోరారు.

## ఏసీబీ వలలో ఇరిగేషన్ శాఖ డీఈఈ



జయభేరి, వరంగల్ :

నీటిపారుదల శాఖలో డీఈఈ గా పనిచేస్తున్న గంటి శ్రీకాంత్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. పాలకుర్తిలో పని చేస్తున్న శ్రీకాంత్ ఒక కంట్రాక్టర్ నుంచి 50 వేల రూపాయలు లంచం తీసుకుంటున్నప్పుడు ఏసీబీ దాడి చేసింది. హన్మకొండలోని భవానినగర్ లో నివాసంలో ఈ దాడి జరిగింది. శ్రీకాంత్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

# ప్రతి గింజా కొంటున్నాం

- రైతులు పండించిన ప్రతి గింజా కొంటాం
- సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు
- మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం
- విద్యా రంగంలో నాణ్యమైన విద్య అందించే లక్ష్యం



జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప కేంద్రం రాష్ట్రంలో పంటను కొనుగోలు చేయడం లేదని, కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదని వివరించారు. ముఖ్యమంత్రితో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పెండింగ్ ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయంపై ఈ సందర్భంగా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హామాలీలు తరలివెళ్లడంతో ఇక్కడ కొంత కొరత ఏర్పడిందని, అలాగే, ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నానని తెలిపారు.

సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామన్నారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల యువతకు ఉపాధి లభించడమే కాకుండా నగర ప్రజల జీవన విధానం మెరుగవుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని, ఈ సందర్భంగా విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ, ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నాయకులను కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పి. సుదర్శన్, జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, సామినేని స్వరాజ్యం, ఎం. గోపాలరావుతో పాటు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతు పక్షాన బీజేపీ పోరాటం..

- నాయకులకు ఘన స్వాగతం పలికిన ఏనుగు సుదర్శన్ రెడ్డి



జయభేరి, మేడ్చల్ :

"రైతు గోస బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, పాయల్ శంకర్ రామారావు పవర్, పైడి రాకేష్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ గుప్త, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరిబాబు, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య పర్యటన సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి షామీర్పేట్ లో స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగం ప్రస్తుతం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ముఖ్యంగా వరి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అనే సంకల్పంతో భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ రైతు పక్షాన నిలుస్తుందని, రైతుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని ఏనుగు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

- ఎమ్మెల్యే ఆదేశంతో ఆర్థిక సహాయాన్ని అందజేసిన సర్పంచ్

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలం గూరకొండలో సోమవారం మృతురాలి కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన గడుగు కురుమన్న కూతురు విద్యార్థిని గడుగు అంకిత అనారోగ్యానికి గురై మృతి చెందింది. దీంతో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ దాసరి చిన్నమ్మ ఉషనప్ప మృతురాలి కుటుంబానికి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో హాజరై గుర్తురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## తొందర్లోనే పటేల్ కుంట చెరువు కూడా సుందరీకరణ

- ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

37.5 కోట్ల రూపాయల వ్యయంతో హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులలో భాగంగా చెరువు యొక్క అలుగు ను తొలగించడం జరిగింది. అలుగు కూల్చివేత పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది. దీంతో చెరువులోని నీరు బయటికి వెళ్లి చెరువు తొందర్లోనే ఖాళీ అవుతుంది అని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తెలియజేశారు. చెరువు ఖాళీ అవడం సుందరీకరణ పనులు ప్రారంభం అవడం పట్ల నాచారం డివిజన్ లోని అన్ని కాలనీల ప్రతినిధులు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొందర్లోనే పటేల్ కుంట చెరువు కూడా సుందరీకరణ పనులు ప్రారంభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, హెచ్ఎంటి నగర్, బాపూజీ నగర్, సరస్వతీ నగర్, ఇందిరానగర్, శ్రీ రాఘవేంద్ర నగర్, రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ తదితర కాలనీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సంఘాలను కోటీశ్వరులుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- మహిళా స్వయం సహాయక బస్సుల ప్రారంభం



జయభేరి, దేవరకద్ర :

రాష్ట్రంలో దాదాపు కోటి మంది మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట పట్టణంలో సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద కొత్తకోట మండలం మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన రెండు ఆర్టిసి బస్సులను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను మంజూరు చేసిందన్నారు. దీని ద్వారా నెలకు రూ. 69,468 స్థిరమైన ఆదాయం మహిళా సంఘాలకు వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటి మంది స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మిరాసపల్లిలో పెట్రోల్ బంకును ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మండలం మిరాసపల్లి లో సోమవారం జాతీయ రహదారి44 పై మహిళా స్వయం సహాయక సంఘాల కు చెందిన ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన పెట్రోల్ బంకును దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హోంగార్డుకు సీపీ గౌస్ ఘన వీడ్కోలు

జయభేరి, కరీంనగర్ :

హోంగార్డుగా చేరి, మూడు దశాబ్దాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాముండ్ల సుందరయ్య పదవీ విరమణ సందర్భంగా సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, సుందరయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.నైట్ డ్యూటీ కోర్టు వాచ్ విధులు నిర్వహించిన సుందరయ్య , 16 31996 న విధుల్లో చేరి తన 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఎంతో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన సుందరయ్య శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో సుందరయ్యకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ, విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు.

# మార్కెట్ యార్డులో భారీ వర్షాలతో రైతుల గోస

- రైతులకు భరోసా ఇచ్చిన బీజేపీ నాయకులు
- మార్కెట్ యార్డులో షెడ్ల నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలి
- మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గానికీ వినతిపత్రం అందజేసిన
- బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి"



**జయభేరి, షాద్ నగర్, మే 25 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ బృందం మార్కెట్ యార్డును సందర్శించి రైతుల పరిస్థితిని పరిశీలించింది. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... గత మూడు రోజులుగా వర్షాల కారణంగా ఇప్పటికే మార్కెట్‌కు వచ్చిన వడ్ల బస్తాలు భారీగా తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. మార్కెట్‌కు నిన్నటి వరకు చేరిన సుమారు 20 వేల వడ్ల బస్తాలకు అదనంగా ఇవాళ మరో 10 వేల బస్తాలు చేరడంతో మొత్తం వడ్ల నిల్వలు భారీగా పెరిగాయి అయితే కురిసిన కుంభవృష్టి కారణంగా సుమారు 20 నుండి 30 వేల బస్తాలు తడిసిపోయినట్లు సమాచారం. ఈ పరిస్థితుల వల్ల టెండర్ల ప్రక్రియ కూడా తాత్కాలికంగా నిలిచిపోవడం బాధాకరం అని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం విష్ణువర్ధన్ రెడ్డి మార్కెట్ సెక్రటరీ, చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గానికి వినతిపత్రం సమర్పించారు. అందులో తడిసిన వడ్లను రైతులకు ఇబ్బంది కలగకుండా స్థానిక రైస్ మిల్లర్ల ద్వారా వెంటనే లిఫ్ట్ చేయాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, మార్కెట్ యార్డులో షెడ్ల నిర్మాణాన్ని ఒక నెలలోపు పూర్తి చేయాలని కోరారు.ఈ విషయాలపై మార్కెట్ పాలకవర్గం సానుకూలంగా స్పందించినట్లు విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.



# మౌలిక సదుపాయాలకే అధిక ప్రాధాన్యత

- కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్
- అనఘాపురి కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయించండి
- కొత్త కిషోర్ గౌడ్ ను ఘనంగా సన్మానించిన అనఘాపురి కాలనీ ముఖ్యులు



**జయభేరి, మేడిపల్లి :**

కాలనీలలో మౌలిక వసతులకే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లుగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తెలిపారు. అనఘాపురి కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్లెంకి జయపాల్ రెడ్డి, కాలనీ ముఖ్యులు మెంతెన అబ్బసాయిలు ఆధ్వర్యంలో కాలనీ సమస్యలపై కొత్త కిషోర్ గౌడ్ ను ఆదివారం ఆయన కార్యాలయంలో కలిశారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేయించాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ ను కాలనీ ముఖ్యులు కోరారు. ఈ సందర్భంగా కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్లెంకి జయపాల్ రెడ్డి, మెంతెన అబ్బ సాయిలు మాట్లాడుతూ.. రోడ్డు నెంబర్ 1 లోని సిసి రోడ్డు పనులు పూర్తి చేయించాల్సిందిగా కోరారు. ఇప్పటికే మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ తన పదవీకాలంలో రూ. 80 లక్షల అభివృద్ధి పనులు పూర్తి చేయించినట్లుగా వెల్లడించారు. అసంపూర్తిగా మిగిలిన కమ్యూనిటీ హాలు, పార్కు ప్రహరీ నిర్మాణాలను పూర్తి చేయించాల్సిందిగా కోరారు. దీనికిగాను కొత్త కిషోర్ గౌడ్ ను కాలనీవాసులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ.. మరో వారం రోజుల్లో రోడ్డు నెంబర్ 1 లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అసంపూర్తిగా మిగిలిన కమ్యూనిటీ హాలు భవన నిర్మాణం, పార్క్ ప్రహరీల నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేయిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెల్లెంకి జయపాల్ రెడ్డి, మెంతెన అబ్బసాయిలు, మహదేవభట్ల శ్రీనివాస్ శర్మ, కొంగరి సంతోష్, కొత్తోజు కృష్ణ, గంధ్రతి శ్రీనివాస్, రామచంద్రయ్య, తవిడబోయిన సుబ్రహ్మణ్యం, ఆకిటి సుధాకర్ రెడ్డి, కిష్టాది మహేంద్ర చారి, గట్టోజు కృష్ణ చారి, ఎలుగు సాయి, పబ్బు ప్రకాష్, ఎంపటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం

**జయభేరి, కీసర :**



మున్సిపల్ కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎం వసంత మేడంకు వినతిపత్రం అందజేయడం జరిగిందని సిఐటియు కీసర మండల కన్వీనర్ బంగారు నర్సింగరావు తెలియజేశారు. కీసర సర్కిల్ కమిషనర్ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకుపోయి సమస్యలకు పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కీసర సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని లేనిపక్షంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై గతంలోనే అనేక విజ్ఞప్తులు చేసినప్పటికీ ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించడం దాఖలను లేవన్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి కార్మికులందరికీ ఈఎస్ఐ పిఎఫ్ అందే విధంగా కృషి చేయాలి. కార్పొరేషన్ లో విలీనమైన కార్మికులందరికీ 18,600 జీతం అమలు చేయాలని, కార్మికులందరికీ వారం తరపు సెలవులు, మున్సిపల్ కిడ్స్ అందజేయాలన్నారు. అవుట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికులకు, సూపర్వైజర్లు డ్రైవర్లకు, వాటర్ వర్క్ సిబ్బందికి, ఎలక్ట్రిషన్స్కు గడిచిన రెండు నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. పాత పెండింగ్ జీతాలు వెంటనే వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్మిక మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయని పక్షంలో జూన్ 8వ తారీకు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడి చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతకింది అశోక్, గడ్డం అశోక్, వనిగంటి మల్లేష్, గడ్డం గోపాల్ ,మహేష్ ,మోత్కుపల్లి రాములమ్మ, చెన్నూరి నాగమణి, మునిగడప జయమ్మ, మోత్కుపల్లి అనిత ,బోసి పద్మ ,కొండాపురం ఎల్లమ్మ, బోర బాలమ్మ, మునిగడప లక్ష్మమ్మ, ఉద్దమర్రి పోచమ్మ, కొలిపాక కనకమ్మ, కందపల్లి అశ్విని పాల్గొన్నారు.

# తెలంగాణలో ఓబెన్ రోర్ ఈ బైక్ కు మంచి స్పందన

**జయభేరి, హైదరాబాద్ :**

ఎలక్ట్రిక్ మోటార్సైకిల్ కంపెనీ ఓబెన్ ఎలక్ట్రిక్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో తన కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. విస్తరణలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో కొత్తగా 20 షోరూమ్లను ఏర్పాటు చేయటంతో పాటు ఏపీలో మరో 10 షోరూమ్స్ను ప్రారంభించనున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ హర్షవర్ధన్ దేశ్ముఖ్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణలో ఐదు, ఏపీలో 4 షోరూమ్స్ను నిర్వహిస్తోందన్నారు. కాగా కంపెనీ ఇటీవల మార్కెట్లోకి తీసుకువచ్చిన ఓబెన్ రోర్ ఇవోకి ఇక్కడి మార్కెట్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ ఎలక్ట్రిక్ బైక్ బుకింగ్స్ ప్రారంభించిన 15 రోజుల్లోనే దేశవ్యాప్తంగా 25,000కు పైగా బుకింగ్స్ రాగా ఇందులో హైదరాబాద్ నుంచి 2,000కు పైగా బుకింగ్స్ వచ్చాయన్నారు. 3.4 కేడబ్ల్యూహెచ్ ఎల్ఎఫ్పీ బ్యాటరీతో కూడిన ఈ బైక్ ఒకసారి చార్జింగ్తో 180 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని చెప్పారు. జూన్ నుంచి డెలివరీ ప్రారంభించనున్న రోర్ ఇవో ధర రూ.1,24,999 (ఎక్స్షోరూమ్) అని దేశ్ముఖ్ తెలిపారు. బెంగళూరులో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ప్లాంట్లో రోర్ బైక్స్ను ఉత్పత్తి చేస్తున్నట్లు దేశ్ముఖ్ చెప్పారు.



# ఫోటోగ్రాఫర్లు ప్రతి ఒక్కరు హెల్త్ కార్డు తీసుకోవాలి

**జయభేరి, దేవరకొండ :**

హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన PPIN ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటోగ్రాఫర్స్ హెల్త్ కార్డును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ కొని యడారు రాష్ట్ర ఫోటోగ్రాఫర్లకు ఫోటో టెక్ అభిమన్య ఎడిట్ పాయింట్ రమేష్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన ఫోటోగ్రాఫర్స్ హెల్త్ కార్డు కార్యక్రమానికి నల్గొండ జిల్లా నలుమూలల నుండి దేవరకొండ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు వెళ్లడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులు గా డాక్టర్ జయప్రకాష్ నారాయణ పల్లె రవి వి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు రాష్ట్రంలో ఉన్న ఫోటోగ్రాఫర్లందరికీ హెల్త్ కార్డు ఏర్పాటు చేసినందుకు పి పి ఐ ఎన్ టీముని అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీమన్నారాయణ అధ్యక్షులు పసుపులేటి కృష్ణ కార్యదర్శి మోహన్ రెడ్డి కోశాధికారి భాస్కర్ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యదర్శి జయరాములు దేవరకొండ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నీల సంజీవ్ కుమార్, సత్యం, సుమన్, నరేష్, నాగరాజు, కలీం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఒకేషనల్ ట్రైనర్ గా అశోక్ కుమార్ ఎన్నిక

- ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు



**జయభేరి, దేవరకొండ :**

విద్యార్థులకు చక్కని సూచనలు, సలహాలతో ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శకులై, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతూన్న కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ కే.అశోక్ కుమార్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ వోకేషనల్ ట్రైలర్ అవార్డు పొందారు. శనివారం 5 వ సమర్థ భారత్ కాన్స్లవే లో ఉత్తమ వోకేషనల్ ట్రైలర్ తెలంగాణ యాన్యువల్ కాన్ఫరెన్స్ 202526 లో అవార్డు పొందడం పాఠశాలకు గర్వకారణం. విద్యార్థులకు రోబో టెక్నాలజీ,ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (ఏఐ),స్కిల్ ఎడ్యుకేషన్ & ఇన్నోవాషన్ వంటి ఆధునిక సాంకేతిక విద్యలను అందిస్తూ వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తునందుకు గాను వారి సేవలను గుర్తించి బహుకరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతకు స్టేట్ వొకేషన్స్ కోఆర్డినేటర్ బి .సాంబ శివ రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ . నాగేశ్వర్ రావు, పాఠశాల ఉపాధ్యాయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# చలివేంద్రానికి మజ్జిగ పంపిణీ



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి రాంరెడ్డి చికెన్ సెంటర్ నిర్వాహకుల కేంచ వెంకట్ వంద కేజీల పెరుగు అందించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కే.ఎం.పి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు వెంకట్ ను ఘనంగా సన్మానించి, అభినందించారు. వేసవిలో పాదచారులకు మజ్జిగ అందించి పుణ్యం కట్టుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, సంపెంగ మురళి ,ఎండి లతీఫ్, బొడ్డుపల్లి మల్లికార్జున్, శ్రీశైలం, కొల్లూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు



**జయభేరి, తుర్కపల్లి, మే 25 :**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొలత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ పుట్ సాయిలు అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం గోపాలపురం, నాగాయపల్లి గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల దాన్యం తరలింపుకు లారీలు రావడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి లారీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అక్రమ మట్టి లారీలను ఒక్కరోజు కేటాయిస్తే సెంటర్లో వడ్లను తగ్గించవచ్చని ఇట్టి సమస్యను అధికారులు త్వరగా స్పందించి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండబోయిన శ్రీశైలం, దాసరి కొండల్, ఉడత రాజు, చిన్నరాజు చింటూ, లకావత్తు లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.




# వడ్లను కొనుగోలు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి
- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**జయభేరి, షాద్ నగర్, మే 25 :**

గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వేలాది వడ్ల బస్తాలు తడిసిపోవడం అత్యంత బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. తడిసిన వడ్లను నాణ్యత పేరుతో తిరస్కరించకుండా ప్రత్యేక నిబంధనలతో కొనుగోలు చేయాలని, స్థానిక రైస్ మిల్లర్ల సహకారంతో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మార్కెట్ యార్డులో తాత్కాలిక షెడ్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేసి మిగిలిన ధాన్యాన్ని రక్షించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఆర్థిక నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రాష్ట్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు.

# డాన్స్ స్టూడియోని సందర్శించిన CI వెంకట్ రెడ్డి




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ C I వెంకట్ రెడ్డి మిత్రుని HMC డాన్స్ స్టూడియోని సందర్శించడం జరిగినది. నైపుణ్యంతో మిత్రుడు ఏడుకొండలు డాన్స్ మాస్టర్ విద్యార్థిని విద్యార్థులకు మంచి డ్యాన్స్ ను అందిస్తున్నాడని తెలియజేసినారు. విద్యార్థిని విద్యార్థులు చదువు తో పాటు అన్ని రంగాల్లో రానించాలని వారికీ చెప్పడం జరిగింది ఈ కార్యక్రమం లో HMC DANCE MASTERS ఏడుకొండలు శివ లక్ష్మి త్రిష చింటూ అఖిల్ మిగతా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ పొదుపు ఆదర్శమేనా..?

✍ జయభేరి, హైదరాబాద్ :






✍ మేరుగు రాజయ్య
దుద్దెనపల్లి, సైదాపూర్
9441 440 791

భారత దేశ వ్యవసాయ రంగం దాదాపు 50 శాతం ప్రజలకు ఉపాధిని ఇస్తుంది. స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో 20 శాతంతో ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా తోడ్పడుతుంది. దేశ ఆహార భద్రతతో పాటుగా ప్రపంచ ఆహార అవసరాలను తీర్చడంలో భాగమై విదేశీమారక ద్రవ్యాన్ని సంపాదించుతుంది. అన్నదాతలైన రైతుల పొదుపు వలననే ఆహార సర్దుబాటు జరుగుతుందన్న సత్యానికి గుర్తింపు లేదు.కుటుంబ సభ్యుల ఆహారానికి అవసరమయ్యే కోడి గుడ్డును, పాలను,నెయ్యిని పూర్తి స్థాయిలో భుజించకుండా మార్కెట్ కు ఇచ్చి అవసరాలను ఆదుకుంటున్నారు. వ్యవసాయం అంటే నమ్మకం లేని రాబడి.రేపటికి రూపం లేదన్న చందంగా వాతావరణ పరిస్థితుల పై ఆధారపడి పంట చేతికి వస్తుంది. విత్తనం విత్తి పంట ఇంటికి వచ్చే వరకు పశుపక్షాదులు,అడవి పందులు,కోతులు అరొక్క జీవరాశి పంటకు ఆశపడతాయి. అధిక దిగుబడుల పేరుతో వచ్చిన కల్తీ విత్తనాల దందా,యూరియా కొరత,పండిన పంటలకు సకాలంలో గిట్టుబాటు లేని ధాన్యం కొనుగోళ్లు, తరుగు పేరుతో తూకంలో కోత ఇలా అనేక సమస్యలతో వ్యవసాయం చేస్తూ దేశ ప్రజల ఆహార భద్రతకు తోడ్పడుచున్నారు. ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రధానమంత్రి తమ పాలనలో రాజ్యాంగం దిక్సూచిగా చట్టాలు రూపొందించడం, ఆదాయాలను సమీకరించడం,అవసరాల ప్రాతిపాదికన ఖర్చు పెట్టడానికి నిర్ణయాలను ప్రకటించడం చేస్తారు. ఇక ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్) వీళ్లు 5,577 మంది ఉన్నారు. వీరితో పాటుగా కొండంత బలగంగా పాలన యంత్రాంగం ఉంటుంది. "శ్రమ విభజన"కలిగిన ఉద్యోగ హోదాలు,నిర్దిష్ట పనుల కేటాయింపుతో విధుల నిర్వహణ ఉంటుంది.ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రతినిధులకు, విద్య అర్హతలతో నియామకం అయిన బ్యూరోక్రాసీ(ప్రభుత్వ యంత్రాంగం)కి మెరుగైన వేతన భత్యాలను,సకల సౌకర్యాలను పొందుతారు. వీళ్లంతా కలిసి ప్రజల నుండి వసూలు చేసిన పన్నుల డబ్బులను దుబారా చేయకుండా,అవినీతికి పాల్పడకుండా ప్రజల కనీస మౌలిక సదుపాయాలకు సక్రమంగా ఖర్చు చేయాలి.అలాగే దేశ అభివృద్ధికి, పర్యావరణ, జీవావరణ పరిరక్షణకు కృషి చేయాలి. కాని బ్రిటిష్ పాలన అంతమై గత 78 ఏండ్లుగా మన ప్రభుత్వ పాలన సాగుచున్నప్పటికీ ప్రజలకు విద్య, వైద్యం, గృహ వసతి కోర్కెలుగానే, ఎన్నికల హామీలుగానే మిగిలిపోయినవి.దేశ సహజ వనరులు, సంపదలు ప్రభుత్వ పరిశ్రమల ప్రక్రియ ద్వారా వికేంద్రీకరించబడి ప్రజలకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలను కల్పించే "పబ్లిక్ సెక్టార్"(ప్రభుత్వ పరిశ్రమలు)ను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, ఓపెన్ బిడ్డింగ్, మేకిన్ ఇండియా, ప్రపంచీకరణ, సరళీకరణ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు. దానితో ఆర్థిక అసమానతలు పెరిగి సామాజిక అభివృద్ధి కుంటుపడుతుంది."వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్టు" ప్రకారంగా భారత దేశంలో దేశం మొత్తం ఆదాయంలో 58 శాతం కేవలం 10 శాతం మంది దగ్గర ఉంది.దిగువ ఆదాయం ఉన్న 50 శాతం మంది దగ్గర 15 శాతం ఆదాయం మాత్రమే ఉంది. దేశ ఆదాయంలో 22.6 శాతం టాప్ లో ఉన్న 1 శాతం శ్రీమంతుల దగ్గర ఉంది. దిగువ ఆదాయ వర్గాల సగటు ఆదాయం 99 వేల రూపాయలుగా,40 శాతం మంది మధ్య ఆదాయ వర్గాల సగటు ఆదాయం 4.5 లక్షలుగా ఉంది. ఇక 10 శాతం అధిక ఆదాయ వర్గాల సగటు ఆదాయం 38 లక్షలకు పైగా ఉండగా, టాప్ 1 శాతం మంది సంపన్నుల సగటు ఆదాయం 1.49 కోట్లుగా ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ 2026 మే 10 నాటి తెలంగాణలో జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి "పొదుపు" పాటించాలని కోరిన ప్రసంగం చర్చనీయాంశం అయింది. సోషల్ మీడియాలో గృహిణులు వంట నూనె పోయకుండా కూర వండిన వీడియోలు, కట్టెల పొయ్యితో వంటలు వండిన వీడియోలు ప్రసారం అయినవి. నడకతో, బస్సు ప్రయాణంతో ఆఫీస్ లకు పోవడం, గృహిణులు బంగారం ధరించకుండా ఆకులు, పూలు ధరించి ట్రోల్ చేశారు. కాని 1965 సెప్టెంబర్ లో అప్పటి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి "ఒక పూట భోజనం మానేయండని"ఇచ్చిన పిలుపును దేశ ప్రజలు ఆదరించారు. ఇప్పటికీ ఆచరిస్తున్నామని చెప్పిన వారు కూడా ఉన్నారు. 1965 సెప్టెంబర్ 1న పాకిస్తాన్ ఇండియాపై "ఆపరేషన్ గ్లాండ్ స్లామ్ "ను ప్రారంభించింది.దానికి ప్రతిగా భారత్ సెప్టెంబర్ 6న లాహోర్ సమీపంలోని అంతర్జాతీయ సరిహద్దుపై దాడి చేసింది. 17 రోజులు యుద్ధం జరిగింది. ఐక్యరాజ్య సమితి ఆదేశించిన కాల్పుల విరమణ ఒప్పందంతో యుద్ధం ఆగింది. అదే సమయంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు"లిండన్ జాన్సన్" లాల్ బహదూర్ శాస్త్రితో పాకిస్తాన్ తో యుద్ధం ఆపకపోతే "పిఎల్ 480 కింద" అమెరికా భారత్ కు పంపించే గోధుమలను, బియ్యాన్ని నిలిపి వేస్తామని బెదిరించాడు.1960 మే 4 న "పబ్లిక్ లా 480" కింద 1.3 బిలియన్ డాలర్లకు నాలుగు సంవత్సరాల కాలంలో 16 మిలియన్ టన్నుల గోధుమలు, 1 మిలియన్ టన్నుల బియ్యం భారత్ కు సరఫరా చేయడానికి ఒప్పుకుంది.దానికి లాల్ బహదూర్ శాస్త్రి బాధపడి భార్య లలితా శాస్త్రితో రేపు "దేశ ప్రజలకు ఒక పూట భోజనం ఆపేయాలని కోరబోతున్నాను. అందుగురించి మన ఇంట్లో ఈ రాత్రి వంట చేయడం మానేయండని చెప్పినట్లుగా లాల్ బహదూర్ శాస్త్రి కొడుకు "అనిల్ శాస్త్రి "ఒక ఇంటర్వ్యూలో గుర్తు చేశాడు.

1990 అగస్ట్ 2 నుండి 1991 ఫిబ్రవరి 28 వరకు "గల్ఫ్ దేశాల మధ్య యుద్ధం జరిగింది. ఇరాక్ కువైట్ పై యుద్ధం చేసి తనలో కలుపుకునే చర్యకు ప్రతిగా అమెరికా నాయకత్వంలో 35 దేశాల సంకీర్ణ దళాలు ఇరాక్ పై యుద్ధం చేసినవి. అలాగే భారత్ తో ప్రధాన వాణిజ్య భాగస్వామి అయిన సోవియట్ రష్యా బలహీనపడింది. చమురు ధరలు పెరిగినవి. దానితో భారత్ లో ఆర్థిక సంక్షోభం వచ్చింది.విదేశీ మారక నిల్వలు అడుగంటి బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ తో దిగుమతుల కోసం, విదేశీ అప్పులను తీర్చడం కోసం అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం "అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ" (ఐఎంఎఫ్)నుండి $ 2.2 బిలియన్ అత్యవసర "బెయిలౌట్ రుణాన్ని తీసుకుంది. (మునిగిపోతున్న ఓడలోని నీటిని బకెట్ తో నీటిని తొలగించడం,ఇబ్బందుల్లో ఉన్న దేశానికి రుణాలు ఇవ్వడం.)అందుకు ప్రతిగా ఆర్థిక సంస్కరణల పేరుతో 1991 జులై 16 న నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాన్ని ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలలో "సామ్యవాద నిర్వహణ"పోయి సరళీకరణ, ప్రైవేటీకరణ,ప్రపంచీకరణ(ఎల్పీజీ) విధానాలు అమలుకు వచ్చాయి.1991 92లో ఎంపిక చేసిన ప్రభుత్వ సంస్థల్లోని 20 శాతం పెట్టుబడుల ఉపసంహరణలో మ్యూచువల్ ఫండ్స్, షేర్ల అమ్మకంతో రూ.3,038 కోట్లు వసూలు చేశారు. మొదట మందకొడిగా సాగిన పెట్టుబడుల ఉపసంహరణ "నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్, బిజెపి వాజ్ పేయి ప్రధానమంత్రి ప్రభుత్వంలో వేగిరమైంది.1999 డిసెంబర్ 10న పెట్టుబడుల ఉపసంహరణ విభాగాన్ని, 2001 సెప్టెంబర్ 6న "పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి ప్రైవేటీకరణను ప్రారంభించారు.

భారత్ లో సగానికి పైగా అల్యూమినియంను ఉత్పత్తి (2.37 మిలియన్ టన్నులు)చేసే "భారత్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్"(బాల్కో)ను 51 శాతం వాటాలను "స్టెర్లైట్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ "కు అమ్మివేశారు.పెట్టుబడుల ఉపసంహరణ మంత్రి అరుణ్ శౌరీ 2002 జులై 26న చెప్పిన వివరాల ప్రకారం ఏడు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా రూ.5,114 కోట్లకు పైగా సమకూరాయని చెప్పారు. యూపీఏ (యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్) మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి ప్రభుత్వంలో వామపక్ష భాగస్వామ్యమున్నందున పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మందగించింది. ఇక 2014 మే 26న నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పరిశ్రమలను బంద్ పెట్టడం లేదా అమ్మి వేసే ప్రక్రియలు ఊపందుకున్నవి. నరేంద్ర మోడీ ఒక ఇంటర్వ్యూలో పబ్లిక్ సెక్టార్ లను మనిషిపుట్టుక, చావులతోని ఉపమానం చేశాడు. "హమారే దేశ్ మే పి.ఎస్.యు (పబ్లిక్ సెక్టార్ యూనిట్స్) కా జన్మ్ హోతా హై, ఓ మరణే కే లీయే హోతా హై, యే బూలే నహి కిసీకా బాల్ మృత్యు హో జాత హై, కిసీకా యువ హో నే కే బాద్ మృత్యు హోత హై, కోయి ఏక్ పరివార్ కో డుబోకే మర్ తా హై, తో పచ్చాస్ పరివార్ కా డుబోకే మర్ తా హై, లేకిన్ మర్ ణా తై హై, ఏక్ తో యే స్థితి హై, అబ్ ఇస్ కే రాస్తే ఖోజే గయే, తో క్యా రాస్తే ఖోజే గయే? యా తో బంద్ కర్ దో, యా తో ప్రైవేటైజ్ కర్ దో, దో రాస్తే ఖోజే గయే! 2025 2026 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.47,000 కోట్లు సమకూర్చుకోవాలని నిర్దేశించినప్పటికీ రూ.34,169 కోట్లకు తగ్గించారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా అధికారంలోకి వచ్చినప్పుడు పెట్రోల్ రూ.71.41, డీసెల్ రూ.56.71,వంట గ్యాస్ రూ 414 ఉంది. ఇప్పుడు పెట్రోల్ రూ.110.89, డీసెల్ రూ.91.58, వంట గ్యాస్ రూ.912.50కి పెరిగింది. ఇక భారత ప్రభుత్వ మొత్తం బకాయిల రుణం 2014లో సుమారు రూ.55.87 లక్షల కోట్లు.2026 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.197.18 లక్షల కోట్లు పెరిగే అవకాశం ఉంది.అంతర్గత రుణంలో మార్కెట్ చేయదగిన ప్రభుత్వ సెక్యూరిటీలు,ట్రెజరీ బిల్లులు, (టి బిల్లులు), పరిహార ప్రత్యేక బాండ్లు కలిపి మొత్తం రుణంలో 95 శాతం పైగా ఉంది. దాదాపు రూ.190.15 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. ఇక బాహ్య రుణంలో ద్వైపాక్షిక, బహుపాక్షిక బాహ్య సహాయం సుమారు రూ.6.74 లక్షల కోట్ల వద్ద సాపేక్షంగా స్థిరంగా ఉంది. ప్రజల పొదుపు, మదుపు ప్రక్రియలతో బ్యాంకులలో పొగైన డబ్బులను పారిశ్రామిక వేత్తలు,పెట్టుబడిదారులు రుణాల పేరుతో బొక్కసాలు నిపుకుంటూ మొండికేస్తున్నారు. దానికి ప్రభుత్వాలు నిరర్థక ఆస్తుల పేర మొండి బకాయిల పేర మాఫీ చేస్తూ ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తున్నారు.2014 నుండి 2025 వరకు సాగిన పదేండ్ల కాలంలో రూ.16.35 లక్షల కోట్లు మొండి బకాయిలను మాఫీ చేసినట్లుగా 2025 మార్చి 17న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో చెప్పారు. ఇక ప్రధాని నరేంద్ర మోడీ విదేశాలకు తరచుగా ఎందుకు ప్రయాణాలు చేస్తున్నారో? విదేశాలు పర్యటించి దేశానికి ఏమి ప్రయోజనాలు కల్పించారో ?? ఏనాడు మోడీ చెప్పలేదు. కనీసం పార్లమెంటులో కూడా చర్చకు లేవనెత్తలేదు. 2015 నుండి 2025 వరకు ప్రధాని విదేశాల పర్యటనకు రూ.762.47 కోట్లు ఖర్చయినట్లుగా 2026 ఫిబ్రవరి 13 న లోకసభలో విదేశాంగ మంత్రిత్వ శాఖ రాతపూర్వకంగా తెలిపారు.ఇప్పుడు మే 15 నుండి 20 వరకు ఐదు దేశాల పర్యటనకు పోయాడు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి ప్రభుత్వం సమయంలో విదేశీ పర్యటనలకు చాలా తక్కువ ఖర్చు చేశారని ఎంఇపి (మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్టర్నల్ అఫైర్స్)రిపోర్టులో పేర్కొనడం గమనార్హం. ఆర్థిక పరిభాషలో మిస్కెలేనియస్ (ఇతర ఖర్చులు) పరిమితంగా ఉంటాయి. కాని 2024 డిసెంబర్ 16న "కాగ్"(భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్) పార్లమెంటులో ప్రవేశపెట్టిన నివేదికలో "ఎనిమిది మంత్రిత్వ శాఖల" పాలనాపరమైన లోపాల వలన 16 కేంద్రప్రభుత్వ రంగ సంస్థలలో రూ.3,437.30 కోట్లు ఆదాయానికి గండి పడినట్లుగా తెలిపింది. ఇక ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాటల్లో భారతీయత చేతల్లో విదేశీయత ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. టెలిప్రాంటర్, పెన్ను, గడియారం, కళ్లద్దాలు, చెప్పులు, కారులు, మోనోగ్రామ్ షూట్ లు అన్నీ విదేశీవి, లక్షల ఖరీదైనవనే వాఖ్యనాలు వచ్చినవి. పెండ్లిల్లలో తోబుట్టువులు కొత్త డ్రెస్ షూట్ లు వేసుకున్న మాదిరిగా నరేంద్ర మోడీ నిత్యమూ నూతనమైన డ్రెస్ లను ధరించుచూ దేశ ప్రజలకు పొదుపు పాటించండని హితవు చెప్పడం ద్వంద్వనీతిగా ఉందన్న విమర్శలు వచ్చినవి. ప్రధాని చెప్పుచున్నట్లుగా పశ్చిమాసియా దేశాల మధ్య యుద్ధాలు జరుగడం వలన భారత్ లో చమురు సంక్షోభం రావడం నిజమే. సంపన్న దేశాల సామ్రాజ్యవాద విధానాల వలన యుద్ధాలు పరిపాటిగా జరుగుచున్నది కూడా నిజమే. అటువంటప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మూడవ దేశంగా భారత్ వెలిగిపోతున్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ఎందుకు ? ఏర్పాటు చేసుకోవడం లేదు. రష్యా, ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకునే అవకాశాలను ఎందుకు ?? ఉపయోగించుకోవడం లేదు. అమెరికా ఆకాంక్షలను అనుగుణంగా దిగుమతులను ఎందుకు??? కొనసాగిస్తున్నారని ఇవ్వాళ ప్రతి పక్షాలు,ప్రజలు కోడై ప్రశ్నిస్తున్నారు. దానికి ప్రభుత్వం అనుమానాలను నివృత్తి చేసి విపత్కర పరిస్థితులను అధిగమించడానికి ప్రజలను సన్నద్ధం చేయాలి. అంతేగాని దేశం యొక్క ఆదాయాలు తగ్గినప్పుడు, అప్పులు పెరిగినప్పుడు బడ్జెట్ లో కోతలు విధించడం, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా వసూళ్లను పెంచుకోవడం, ఆస్తులు అమ్మడం,అప్పులు చేయడం వలన ప్రజల పొదుపు పోయిన నీటికి కట్ట కట్టిన చందంగా ఉంటుంది.



## గూర కొండలో విద్యార్థిని మృతి

**మృతురాలి స్వగ్రామంలో విషాదం.. నాయకుల పరామర్శ**

✍ జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గూరకొండలో సోమవారం ఓ విద్యార్థిని అనారోగ్యానికి గురై మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి... గూరకొండ గ్రామానికి చెందిన గడుగు కురుమన్న కూతురు గడుగు అంకిత స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. అయితే గత కొన్ని రోజులుగా గడుగు అంకిత కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. అయితే అంకిత పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రికి తరలించారు. దీంతో అక్కడ చికిత్స పొందుతూ అంకిత మృతి చెందింది. అందరితో కలిసిమెలిసి ఉండే అంకిత మృతి చెందడంతో గూర కొండ గ్రామంలో విషాదం ఛాయలు అలుముకున్నాయి. మృతురాలి స్నేహితులు జరిగిన సంఘటనను జీర్ణించు కోలేకపోతున్నారు. చిన్న వయసులో అంకిత మృతి చెందడంతో మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీరు మునీరుగా విలపిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పలువురు నాయకులు, గ్రామస్తులు పరామర్శించారు.

## కాలుష్య నివారణపై చర్యలు చేపట్టాలని భారీ ప్రజా మనవహారం




✍ జయభేరి, పరవాడ:

లంకలపాలెం జంక్షన్లో కాలుష్య నివారణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బొగ్గు లారీలు ఫ్లేయాష్ వాళ్ళ వస్తున్న కాలుష్యంపై చర్యలు చేపట్టాలని బ్రిడ్జిని నిర్మించాలని పెద్ద ఎత్తున ప్రజలు గ్రామం, జంక్షన్లో ర్యాలీ, మనవహారం నిర్వహించారు.కాలుష్యం పై ఎన్ని సార్లు వినతిపత్రంలు సమర్పించిన ఎంత మందికి నాయుకులు తెలిపిన ఎటువంటి ఉపయోగం లేకుండా పోతుందని వాపోయారు.దీనిపై వెంటనే ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టాలని లేకపోతే కాలుష్య నివారణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు,ర్యాలీలు చేపట్టాతాము అని తెలియజేసారు.పోరాట కమిటీ సభ్యులు మానవహారం వలన కొంత సేపు లంకెలపాలెం జంక్షన్లో ట్రాఫిక్ అంతరాయం కల్గి వాహనాలు నిలిచిపోయాయి వెంటనే పరవాడ పోలీస్ స్టేషన్ సీఐ మల్లికార్జునరావు నిరసనకారులుతో మంతానాలు చేసి ట్రాఫిక్కు క్లియర్ చేసారు.ఈ నిరసన కార్యక్రమంలో అఖిలా పక్ష నాయుకులు పోరాట కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## కండ్లకోయలో ఘనంగా టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



✍ జయభేరి, మేడ్చల్ :

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్లకోయ గ్రామంలో టీఆర్ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంచార్జిలు గుర్రం వెంకటేష్, మేక లలిత యాదవ్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు నవీన్ చారి తెలంగాణ రక్షణ సేన (TRS) జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి టీఆర్ఎస్ నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి రామిడి వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు ఎత్తరి మారయ్య, గుండెబోయిన శశిధర్, పడాల మనోజ్, సంధ్యారెడ్డి, లక్ష్మి శ్రావణి, కోల స్వర్ణ, అశోక్ కుమార్, క్రాంతి కుమార్, సక్రు నాయక్, విమల రెడ్డి, స్వప్న రెడ్డి, దేవి యాదవ్, పద్మజ, జంగిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోహెడ గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత

✍ జయభేరి, రంగారెడ్డి :

కోహెడ గ్రామంలో సోమవారం నాడు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫ్రూట్ మార్కెట్ కు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు కేటాయిస్తామంటూ గ్రామానికి అధికారులు వచ్చారు.దాంతో స్థానికులు, రైతులు అధికారులపై తిరుగుబాటు చేసారు. అధికారులకు, రైతులకు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. జేసీబీ ముందుకు వెళ్లకుండా రోడ్డుపై పడుకుని వృద్ధురాలు నిరసనకు దిగింది. ఆర్డీవో, ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్ ను రైతులు రైతులు అడ్డుకున్నారు. మండుటెండలోనూ నిరసన చేపట్టారు. ఉద్రిక్తత నేపథ్యంలో కోహెడ గ్రామంలో భారీగా పోలీసుల మోహరింపు జరిగింది.



## ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గా ఉప్పు సాయికిరణ్

✍ జయభేరి, తుర్కపల్లి, మే 25 :

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గా తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామానికి చెందిన ఉప్పు సాయికిరణ్ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్ గా అవకాశం ఇచ్చినటువంటి రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేస్తానని అన్నారు. కార్యకర్త నమ్మకాన్ని, రాష్ట్ర శాఖ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.

## సామాన్యుడి నడ్డి విరిస్తున్న పెట్రోల్, డీజిల్ ధరలు

**ధరలని తగ్గించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గనిశెట్టి డిమాండ్**

✍ జయభేరి, పరవాడ:




రోజు రోజుకి పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే రద్దు చేయాలని పరవాడ గ్రామంలో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పది రోజుల్లో మూడవసారి పెట్రోల్ ,డీజిల్ ధరలను పెంచి ప్రజలు నడ్డి విరిచిందని పెట్రోల్ పై లీటరుకు 87 పైసలు డీజిల్ పై 91 పైసలు పెంచడంతో గత పది రోజుల్లో లీటర్ పెట్రోల్ నాలుగు రూపాయలు 77 డీజిల్ 4 రూపాయల 81 పైసలు పెంచిందని ఈ పెంపుదలను ఉపసంహరించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది చమురు సంస్థలు ఒత్తిడితో పెట్రోలు డీజిల్ ధరలను కనీసం లీటర్ కు 15 వరకు పెంచడానికి కేంద్రం సిద్ధమైనట్లు వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని చమురు కొరతలేదని ధరలు పెరగవని ఎన్నికల ముందు చెప్పిన కేంద్రం నేడు వరుసగా పెంచడం ప్రజలను మోసగించడమేనని ఒక్కసారిగా భారీగా పెంచితే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని దసలవారీగా పెంచడం అంటే ప్రజలు వంచించడమేనని ఇంధన ధరలు పెరుగుదలతో రవాణా ఖర్చులు అన్ని రకాల సరుకుల ధరలు మరింత పెరుగుతాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు డీజిల్ పై వేస్తున్న పన్నులను తగ్గించాలని ప్రజల మీద పెంచిన ధరలు తగ్గించాలి పెంచిన పెట్రోలు డీజిల్ ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో కట్టా సూరిబాబు, ఎస్. కృష్ణ అప్పారావు, వాసిరెడ్డి నాయుడు, పాల్గొన్నారు.

